సాక్షి కర్నూలు

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024

చైతన్య దీప్తి.. సేవలే స్ఫూర్తి



వందేమాతర ఉద్యమంలో పాల్గొన్న తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు. నంద్యాల తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నేడు గాడిచర్ల జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

8లో▸

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.

టీబీ డ్యాం సమాచారం



పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.90
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.382
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 25,671
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:24,228

న్యూస్‌రీల్

పెద్దాసుపత్రిలో ఫిర్యాదుల బాక్స్‌లు



ఫిర్యాదు బాక్స్‌లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐదు ప్రాంతాల్లో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో బాక్స్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుల బాక్స్‌లను ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, గైనిక్, పీడియాట్రిక్స్, శుశృతభవన్, సూపర్‌స్పెషాలిటీ విభాగం వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. రోగులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే నేరుగా సూపరింటెండెంట్ కార్యాలయం దగ్గరకొచ్చినా వెంటనే పరిష్కరిస్తామన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(లీగల్): జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, కార్యదర్శి ఎల్.వి.శేషాద్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో రాజీ కాగల క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, రోడ్డు ప్రమాద కేసులు, బ్యాంకు, మున్సిపల్, ప్రీలిటిగేషన్, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సాయంత్రం ఓపీలో వైద్యులు ఉండాల్సిందే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ విధుల్లో ఉన్న వైద్యులే సాయంత్రం ఓపీలో కూడా తప్పనిసరిగా ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు తప్పకుండా ఓపీ నిర్వహించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రిని నమ్ముకుని చికిత్స కోసం వచ్చే రోగులు ఉదయం చికిత్స చేసిన వైద్యులే సాయంత్రం కూడా చూస్తేనే సంతృప్తి చెందుతారని, ఈ మేరకు తప్పనిసరిగా ఉదయం ఉన్నవారే సాయంత్రం కూడా ఉండాలని ఆదేశించారు. వీరిని పర్యవేక్షించేందుకు సీఎస్ఆర్ఎంఓ డి.వెంకటేశ్వరరావును నియమించామన్నారు. సాయంత్రం ఓపీ వివరాలను నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి ప్రతిరోజూ అధికారులకు అందజేయాలన్నారు.

సీసీహెచ్‌లకు 17 నుంచి శిక్షణ

కర్నూలు కల్చరల్: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం సీసీహెచ్‌లకు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు మ్యాపింగ్ చేసిన పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణలో సీసీహెచ్‌లతో పాటు ఎంఈఓలు కచ్చితంగా పాల్గొనాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంలోని కొన్ని పదార్థాలు చేసేందుకు సీసీహెచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు బాధ్యులని, వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మహానందిలో 3 నుంచి శరన్నవ రాత్రోత్సవాలు

- కామేశ్వరీదేవికి రోజూ అలంకార, వాహనసేవలు

మహానంది: మహానంది ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి ప్రతి రోజూ అలంకార, వాహన సేవలు ఉంటాయన్నారు. 3వ తేదీన శైలపుత్రిదుర్గ, 4న బ్రహ్మచారిణీ దుర్గ, 5న చంద్రఘంట దుర్గ, 6న కూష్మాండ దుర్గ, 7న స్కందమాత దుర్గ, 8న కా త్యాయిని దుర్గ, 9న కాళరాత్రిదుర్గ, 10న మహాగౌరిదుర్గ, 11న సిద్ధిధాత్రి దుర్గ, 12న నిజరూపమైన కామేశ్వరీదేవి అమ్మవారిగా భక్తుల కు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా శతచండీయాగం, శ్రీ చక్రార్చన, నవదుర్గ కలశార్చన, రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర దీపోత్సవం, అలంకార పూజలు, వాహనసేవలు ఉంటాయని వివరించారు. ఎవరైనా భక్తులు రూ. 13వేలు చెల్లించి ఒకరోజు పూజల్లో పాల్గొనవచ్చన్నారు.

మెడి'కిల్' బాబు



ప్రభుత్వం పునరాలోచించాలి



వైద్య విద్య ద్వారా డాక్టర్ కావాలనే విద్యార్థులు పడుతున్న కష్టానికి తగిన ఫలితం వస్తుందో రాదో అన్న సందేహం నెలకొంది. గతేడాది మాదిరిగా ఈయేడాది కూడా ఐదు కొత్త కాలేజీలకు అనుమతులు వచ్చింటే 750 సీట్లు పెరిగి, చాలా మంది విద్యార్థుల డాక్టర్ కల నెరవేరేది. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆ వైపు అడుగులు వేయడం లేదు. విద్యార్థుల కష్టాన్ని వమ్ము చేయకుండా ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలి.

– చంద్రకళ, విద్యార్థి తల్లి, కృష్ణగిరి

ప్రైవేటుకు ఇవ్వొద్దు



నాన్న ప్రైవేటు సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తారు. ప్రభుత్వ రంగంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేటురంగానికి అప్పగిస్తే పేద మెరిట్ విద్యార్థులకు, రిజర్వేషన్ ఉన్న వారికి వైద్య విద్య దూరం అవుతుంది. డబ్బున్న వారికే వైద్య విద్య అన్న చందంగా వ్యవస్థ తయారవుతుంది. ఇక్కడ వైద్య సీట్లు ఖరీదైతే మళ్లీ ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తుంది. కొత్తగా ప్రభుత్వ మెడికల్‌కాలేజీలు వస్తే స్థానిక విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది. ఫీజులు కూడా అందుబాటులో ఉంటాయి.

–వి. గురుపార్థీప్, కర్నూలు

ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు



మెడికల్ కాలేజీలను పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) పద్ధతిలో నిర్వహిస్తే పేదలకు మెడికల్ సీట్లు ఎలా వస్తాయి? గత ప్రభుత్వం పేదల కోసం పని చేస్తే ఈ ప్రభుత్వం ధనికుల కోసం ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు. కొత్త కళాశాలలకు అనుమతులు వస్తేనే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వ తీరుతో పేద పిల్లలకు అవకాశం లేకుండా పోయింది.

– బండపల్లె రమేష్, దుర్వేశి గ్రామం, గడివేముల మండలం

పేద విద్యార్థులకు నష్టం



నేను పదవ తరగతిలో 587 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 430 మార్కులు సాధించాను. నీట్ యూజీలో మంచి ర్యాంకు వస్తే ప్రభుత్వ మెడికల్ కాలేజీలోనే చేరతాను. ప్రభుత్వ కళాశాలలో మంచి ప్రొఫెసర్లు ఉంటారు. సౌకర్యాలు బాగుంటాయి. ప్రాక్టికల్స్ చేయడానికి ఎంతో అనువుగా ఉంటుంది. ఇవన్నీ ప్రైవేటు మెడికల్ కాలేజీలో లభించవు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇచ్చేస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్యవిద్య దూరం అవుతుంది. మంచి మార్కులు వచ్చినా వారికి ఉపయోగం ఉండదు.

–కె. హేమశ్రీ, కర్నూలు

నిమజ్జనోత్సవానికి బందోమస్తు



- రేపు కర్నూలులో వినాయక నిమజ్జనోత్సవం
- బందోబస్తుకు మూడు జిల్లాల నుంచి 2 వేల మంది పోలీసులు
- సీసీ కెమెరాలతో నిఘా

కర్నూలు: గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోంది. కర్నూలు నగరంలో ఈ నెల 15న నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వేడుక సాగడానికి నిమజ్జన కార్యక్రమాన్ని ఆద్యంతం డ్రోన్, సీసీ, వీడియో కెమెరాలతో చిత్రీకరించనున్నారు. ఇప్పటికే మండపాల కమిటీ సభ్యులకు పోలీస్ స్టేషన్ల వారీగా సూచనలు ఇచ్చారు. శోభాయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌లో నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఇందు కోసం కర్నూలుతో పాటు నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి సుమారు రెండు వేల మంది పోలీసులను విధులకు నియమించారు.

ప్రమాదాలకు తావివ్వకుండా..

నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి వినాయక ఘాట్‌కు విగ్రహాలు నిమజ్జనానికి ఎక్కువగా తరలి వచ్చే అవకాశముంది. ప్రమాదాలకు తావు ఇవ్వకుండా ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వేడుక నిర్వహణ, ప్రణాళిక, రూట్ మ్యాప్, సిబ్బంది నియామకం ఇప్పటికే పూర్తయ్యింది. సబ్ డివిజన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లతో డీఎస్పీ బాబు ప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఐ, ఎస్‌ఐలకు కీలక సూచనలు ఇచ్చారు. నగరంలోని అన్ని వీధుల్లో సుమారు రెండు వేలకు పైగా వినాయకులు మండపాల్లో కొలువుదీరి పూజలందుకుంటున్నారు. పోలీసు శాఖ వాటి వివరాలను ఆన్‌లైన్ చేసింది. ఎక్కడ ఏమి జరిగినా సాంకేతికతతో తెలుసుకుంటారు. శాంతిభద్రతల పరిరక్షణ బృందాలను రంగంలోకి దింపుతారు.

శోభాయాత్ర సాగే దారులపై అధ్యయనం

నగరంలో శోభాయాత్ర ప్రారంభమయ్యే రాంబొట్ల దేవాలయం నుంచి వినాయక ఘాట్ వరకు దారులను క్షేత్రస్థాయిలో పోలీసులు అధ్యయనం చేశారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో కలసి రోడ్లకు పడిన గుంతలు పూడ్చివేసి వేలాడే విద్యుత్ తీగలను సరిచేయించారు. అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఇప్పటివరకు 20 శాతం గణనాథులు నిమజ్జనానికి వెళ్లగా ఆదివారం అత్యధికంగా వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. బాలాజీ నగర్, వెంకటరమణ కాలనీలోని కొన్ని ప్రాంతాలు, విష్ణు టౌన్‌షిప్ తదితర కాలనీల నుంచి వచ్చే విగ్రహాలను మునగాలపాడు జాతీయ రహదారి పక్కన కేసీలో నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ కూడా పోలీసు బందోబస్తుకు సిబ్బందిని నియమించారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో 11 మంది డీఎస్పీలు, 58 మంది సీఐలు, ఆర్‌ఐలు, 138 మంది ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, 346 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 642 మంది కానిస్టేబుళ్లు, 34 మంది మహిళా పోలీసులు, 464 మంది హోం గార్డులు, 6 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 15 స్పెషల్ పార్టీ బృందాలతో పాటు బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలను బందోబస్తు విధులకు నియమించారు.

డీజేలకు అనుమతి లేదు

డీజే శబ్దాలు, భజనలు, కోలాటాలు, ఊరేగింపు హడావుడి, బాణసంచా నిమజ్జనంలో భక్తజన సందోహం. ఇలా ఎక్కడా తగ్గకుండా నిమజ్జన వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే శోభాయాత్రలో డీజేలు వినియోగించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. మత్తులో శోభాయాత్రలో పాల్గొనవద్దనే ఆంక్షలు ఉన్నాయి. సామాన్యులకు ఇబ్బందులు లేకుండా వేడుకలు సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత కమిటీలదే. విద్యుత్ తీగలు తగలకుండా నిర్దేశిత రూట్ మ్యాప్‌లోనే యాత్ర సాగాలి.

శాఖల మధ్య సమన్వయం

నిమజ్జనోత్సవాలను తిలకించేందుకు ఘాట్‌ల వద్దకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. వీరికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా పోలీసు, విద్యుత్, వైద్య ఆరోగ్య, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జన ప్రదేశాల్లో ఆరు ఘాట్‌లు, ఎనిమిది క్రేన్లను ఏర్పాటు చేశారు. ఆయా ప్రదేశాల్లో గజ ఈతగాళ్లతో పాటు బోట్లు ఏర్పాటు చేస్తున్నారు.

15న నగరంలో ట్రాఫిక్ మళ్లింపు



గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు నగరంలోని ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యవసర సర్వీసులైన అంబులెన్స్‌లు, పోలీసు వాహనాలు, అగ్నిమాపక వాహనాలు, సేవల కోసం పోలీసులతో అనుమతి పొందిన వాహనాలను మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తామన్నారు.

- ➤ కొత్తబస్టాండ్ నుంచి రాజ్‌విహార్, ప్రభుత్వాసుపత్రి మీదుగా వినాయక ఘాట్, గాయత్రి ఎస్టేట్ వరకు అన్ని వాహనాలపై నిషేధం ఉంటుంది.
- ➤ బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు బళ్లారి చౌరస్తా మీదుగా చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంకు, బిర్లా జంక్షన్, మద్దూర్ నగర్ సర్కిల్, సి.క్యాంప్ మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వైపు వాహనాల రాకపోకలు ఉంటాయి.
- ➤ అలాగే ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు నుంచి వచ్చే వాహనాలు చెక్ పోస్టు నుంచి సి.క్యాంప్, బిర్లాగేట్, గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.
- ➤ హైదరాబాద్, గద్వాల, అలంపూర్ నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి, సంతోష్‌నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.
- ➤ అనంతపురం, డోన్ వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- ➤ వినాయక్ ఘాట్ వద్ద విగ్రహాల నిమజ్జనం పూర్తయిన తర్వాత దేవనగర్ మీదుగా కృష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్లే విధంగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేశాం.

ఇతరుల మనోభావాలు కించపరచొద్దు



నిమజ్జన ఊరేగింపు సమయంలో ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యవహరించొద్దు. నిమజ్జనం కోసం వెళ్లేటప్పుడు చిన్నపిల్లలను పెద్దలు కనిపెట్టుకుని ఉండాలి. ఈత రానివారు నీళ్లలోకి దిగరాదు. నిమజ్జన సమయంలో మద్యానికి దూరంగా ఉండాలి. నిమజ్జనానికి చిన్నారులను ఒంటరిగా పంపించరాదు. రోడ్ల పక్కన ఉండే భవనాలపై చివర నిల్చుని, కూర్చుని చూడటం ప్రమాదకరం. ఆసుపత్రుల దగ్గర హోరెత్తించే డీజేలతో రోగులకు ఇబ్బంది కలిగించరాదు. మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు. నిమజ్జన వేడుకల్లో ఏ చిన్నపాటి సంఘటనలు చోటు చేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయి.

– బిందుమాధవ్, ఎస్పీ

ప్రతి మండపానికి ఓ కానిస్టేబుల్



వేడుకలపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేశాం. ప్రతి మండపానికి ఓ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశాం. నిమజ్జనం పూర్తయ్యేవరకు వారికే బాధ్యతలు అప్పగించాం. సెక్టారు పరిధిలో ఉండే ఎస్‌ఐలు విధిగా తమ పరిధిలోని మండపాల బాధ్యత తీసుకుని నిమజ్జనం చేయించాలి.

– బాబుప్రసాద్, డీఎస్పీ

రూ.40 లక్షలతో అన్ని సౌకర్యాలు

- నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): గణేశ్ నిమజ్జనోత్సవానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా రూ.40 లక్షలతో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి శుక్రవారం వినాయక ఘాట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ తరువాత కర్నూలులోనే అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. వినాయకచవితి పండుగ అనంతరం తొమ్మిది రోజులకు నిమజ్జనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నిమజ్జన వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రధాన కూడళ్లలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. విద్యుత్ దీపాలు, మైకులు, షామియానాలు, కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిమజ్జనం నిర్వహించే ఆరు ఘాట్లకు ఆరు క్రేన్లు, వీటికి అదనంగా మరో రెండు క్రేన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఘాట్ల వద్ద గజఈతగాళ్లను ఉంచనున్నామని, 360 మంది పారిశుద్ధ్య కార్మికులు ఇక్కడ విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిట్రా సత్యనారాయణమ్మ, విక్రమసింహారెడ్డి, యూనుస్‌బాషా, జుబేర్, సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఏసీపీ రంగస్వామి పాల్గొన్నారు.



వినాయక ఘాట్‌ను పరిశీలిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు

పంచాయతీల గ్రేడ్ల మార్పు

- సీపీఆర్‌కు పంపిన జనాభా, ఆదాయ వివరాలు
- గ్రేడ్ల వారీగానే కార్యదర్శుల నియామకం
- ప్రస్తుత బదిలీల్లో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సూచనల అమలు

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీ జనాభా, ఆదాయాన్ని అనుసరించి జిల్లాలోని గ్రామ పంచాయతీల గ్రేడ్లను మార్చేందుకు కార్యాచరణ సిద్ధమైంది. పీఆర్ అండ్ ఆర్డీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2011 జనాభా, గత మూడు సంవత్సరాలుగా ఆయా గ్రామ పంచాయతీలకు వస్తున్న తలసరి ఆదాయ వివరాలను సీపీఆర్‌కు పంపారు. ఈ నేపథ్యంలోనే గ్రామ పంచాయతీ గ్రేడ్లలో కదలిక వస్తోంది. పలు గ్రామ పంచాయతీలకు ఆదాయం ఎక్కువగానే ఉన్నా గ్రేడ్లలో వ్యత్యాసం ఉంది. పైగా ప్రస్తుతం కొనసాగుతున్న గ్రేడ్లు గత రెండు దశాబ్దాల క్రితం ఉన్న ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించారు. ప్రస్తుతం మున్సిపాలిటీల సమీపంలో ఉన్న పలు గ్రామ పంచాయతీలలో వివిధ రూపాల్లో ఆదాయ వనరులు కూడా పెరిగాయి. అలాగే గ్రేడ్ల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో కూడా వ్యత్యాసాలు ఉన్నాయి. కొందరు పనిభారం తగ్గించుకునేందుకు తక్కువ గ్రేడ్ పంచాయతీల్లో విధులు నిర్వహించడం, మరికొందరు తక్కువ గ్రేడ్ కార్యదర్శులు ఎక్కువ గ్రేడ్ పంచాయతీల్లో పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సీపీఆర్ నిబంధనల మేరకు జనాభా, తలసరి ఆదాయాలకు అనుగుణంగా పలు గ్రామ పంచాయతీల గ్రేడ్లు మారే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పలువురు పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం కలిగే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఆదాయాలకు అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా అర్హులైన పంచాయతీ కార్యదర్శులను(గ్రేడ్ల వారీగా) నియమించే అవకాశాలు లేకపోలేదు.



గ్రామ సచివాలయం

గ్రామ పంచాయతీల వివరాలు ...

- ➡ మొత్తం గ్రామ పంచాయతీలు ... 484
- ➡ రూ.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న పంచాయతీలు:19 (గ్రేడ్–1)
- ➡ రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న పంచాయతీలు: 13 (గ్రేడ్–2)
- ➡ రూ.లక్ష నుంచి రూ.3 లక్షల్లోపు ఆదాయం ఉన్న పంచాయతీలు: 92 (గ్రేడ్–3)
- ➡ రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలు: 360 (గ్రేడ్–4)

గ్రేడ్ల ఆధారంగానే కార్యదర్శుల నియామకం

గ్రామ పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలని, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్‌ను బట్టే గ్రామ పంచాయతీకి నియమించాలని ఇటీవలే పీఆర్‌అండ్‌ఆర్డీ సూచనల మేరకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్లలో వ్యత్యాసం ఉంటే జీతాల విడుదలలో సమస్యలు తలెత్తే అవకాశాలను వారు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో కచ్చితంగా గ్రేడ్లను అనుసరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలో గ్రేడ్ –1 నుంచి గ్రేడ్ –4 వరకు మొత్తం 282 మంది పంచాయతీ కార్యదర్శులు ఉండగా, గ్రేడ్–5 కార్యదర్శులు 162 మంది ఉన్నారు. వీరందరినీ ఆయా గ్రేడ్ పంచాయతీలకు నియమించేందుకు చర్యలు చేపడుతున్నారు.

వివరాలు పంపాం



సీపీఆర్ కోరిన నేపథ్యంలోనే జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలను పంపాం. ఆయా గ్రామ పంచాయతీల జనాభా, వరుసగా మూడేళ్ల తలసరి ఆదాయ వివరాలను అందులో పొందుపరిచాం. అలాగే ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కూడా పీఆర్‌అండ్‌ఆర్డీ, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ నిబంధనలను అనుసరిస్తున్నారు.

– టి.నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం


మృతిచెందిన ఆదాము

పాములపాడు: వేంపెట గ్రామ సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వెలుగోడు మండలం మోత్కూరు గ్రామానికి చెందిన ఆదాము(40) ట్రాక్టర్‌లో బిలుకు తరలిస్తుండగా వేంపెంట సమీపంలోని సుబ్బారెడ్డి పొలం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆదాము అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఇంటికి తరలించారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదు. మృతునికి భార్య సావిత్రి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డీసీసీబీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ


కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటైంది. డీసీసీబీలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) గీత ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చూస్తూ సీఈవో విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీబీ ప్రధాన కార్యాలయంతో పాటు బ్రాంచీల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదురైతే ఈ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. లైంగిక వేధింపులపై కమిటీ సభ్యులు ఏజీఎం గీత(9951616115), చీఫ్ మేనేజర్ ఇందిరా ప్రియదర్శిని(9951027790), మేనేజర్ చైతన్య (9966649699)లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పకడ్బందీగా 'గ్యాప్' పొలంబడులు

కర్నూలు(అగ్రికల్చర్): గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(గ్యాప్) కింద పొలంబడి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ఎవాల్యుయేటర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్నూలు ఉద్యాన భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఏవో, ఏడీఏలతో గ్యాప్ పొలంబడి కార్యక్రమాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండలంలో ఒక గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని ఆహార పంటల్లోనే నిర్వహించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ.. పంట కోతలు పూర్తి అయి నూర్పిడి తర్వాత మార్గదర్శకాలకు అనుగుణంగా శ్యాంపుల్స్ తీసి ల్యాబ్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఏవో కిరణ్మయి, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు పాల్గొన్నారు.

చైతన్య దీప్తి.. సేవలే స్ఫూర్తి

- ఆంధ్రా తిలక్‌గా గాడిచెర్ల హరి సర్వోత్తమరావు ఖ్యాతి
- వందేమాతరం ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడు
- రాత్రి బడులతో వయోజనులకు చదువు నేర్పిన గురువు
- ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి మొదటి ఎమ్మెల్యేగా ఎన్నిక
- నేడు గాడిచెర్ల 141వ జయంతి



కోవెలకుంట్ల: బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి భారతదేశానికి స్వాతంత్య్రం సిద్ధింప జేసేందుకు పోరాటం చేసిన ఎందరో మహానుభావుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు ఒకరు. వందేమాతరం ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడై.. ఆంధ్రాతిలక్‌గా పేరుగాంచి జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారు. గ్రంథాలయాల అభివృద్ధికి విశిష్ట సేవలందించి గ్రంథాలయ పితామహుడిగా పేరు ప్రఖ్యాతులు గడించారు. పేద కుటుంబంలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి స్వాతంత్య్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించటమే కాకుండా ఎన్నో రచనలు రచించారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి ఎన్నికైన మొట్టమొదటి ఎమ్మెల్యేగా చరిత్రకెక్కారు. కర్నూలుకు చెందిన భాగీరథీబాయి, వెంకటరావు దంపతులకు 1883 సెప్టెంబర్ 14వ తేదీన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జన్మించారు. ఈయన విద్యాభ్యాసమంతా కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లా గుంతకల్లు, గుత్తిలో సాగింది. పేద కుటుంబం కావడంతో ఇంటి పనులు చేసి మరీ పాఠశాలకు వెళ్లి చదువుకునే వారు. చిన్నతనం నుంచి గాడిచెర్ల చదువుతోపాటు ఆటపాటల్లో ప్రావీణ్యం పొందారు. ఆయన చేతిరాత అద్భుతంగా ఉండేది. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో కళ్లు చెదిరేలా రాసేవారు. థేయర్స్ రచించిన హిస్టరీ ఆఫ్ అబ్రహం లింకన్ అనే గ్రంథాన్ని గాడిచెర్ల తెలుగులో అనువదించి విజ్ఞాన మండలి తరుపున మొదటి పుస్తకంగా ప్రచురించారు. 1907లో ఎంఏ పూర్తి చేసి ఉపాధ్యాయ శిక్షణకు గాడిచెర్ల రాజమండ్రిలో ట్రైనింగ్ కళాశాలకు వెళ్లారు. ఉదయం కళాశాలకు వెళ్తూ రాత్రివేళల్లో నిరక్షరాస్య వయోజనుల కోసం రాత్రి బడులు ఏర్పాటు చేసిన ఘనత గాడిచెర్లదే. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవడంతో ఆయనలో అంతర్గతంగా దాగి ఉన్న స్వాతంత్య్ర పిపాస, దేశ భక్తి ఒక్కసారిగా పెల్లుబుకాయి.

సేవలు సర్వోత్తమం

వందేమాతర ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడిగా గాడిచెర్ల రంగప్రవేశం చేసి అకుంఠిత దీక్షతో ఉద్యమించారు. సాహిత్యం, వయోజన విద్య, గ్రంథాలయోద్యమం, పత్రికా రచన, సంఘసంస్కరణ, సంఘీభావ ప్రకటనలు, సభలు, సమావేశాలతో ఆయన జీవితం ముందుకు సాగింది. స్వాతంత్య్ర ఉద్యమంలో బ్రిటీష్‌వారు బాలగంగాధర తిలక్‌ను అరెస్ట్ చేసిన రోజునే గాడిచెర్లను అరెస్టు చేసి వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీంతో గాడిచెర్ల ఆంధ్రా తిలక్‌గా పిలువబడ్డారు. జైలులో ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం ముప్పు తిప్పలు పెట్టింది. జైలులో ఉంటూనే అనేక గ్రంథాలు రచించారు. ఒకవైపు స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూ మరోవైపు రచనలు, ఆకాశవాణి ప్రసంగాలు, సభలు, సమావేశాలు, సాంఘిక సంస్కరణలు, గ్రంథాలయాల ఏర్పాటు, గ్రంథాలను సమకూర్చడం, పత్రికలు నడపడం వంటి పనుల్లో తలమునకలై ఉండేవారు. హోంరూల్ ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించడమే కాకుండా బ్రిటీష్ వస్త్ర బహిస్కారం, జాతీయ విద్య, కల్లు, సారా పికెటింగ్‌లో ఈయన కనుసన్నల్లో నడిచేవి. చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ స్థాపించిన స్వరాజ్య పార్టీని ఆంధ్రలో అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోప్రకాశం జిల్లా మార్కాపురం, గిద్దలూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలతో ఉన్న నంద్యాల స్థానం నుంచి 1928వ సంవత్సరంలో పోటీచేసి మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే మద్రాసు కౌన్సిల్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.


వెలుగోడు గ్రంథాలయ ఆవరణలో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన గాడిచెర్ల విగ్రహం

సేవలకు గుర్తుగా..

స్వాతంత్య్ర ఉద్యమంలో పాలు పంచుకోవడంతో పాటు గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన గాడిచెర్ల సేవలకు గుర్తుగా ఆయన విగ్రహాలను గ్రంథాలయాల్లో నెలకొల్పుతూ స్మరించుకుంటున్నారు. ప్రజల కోసం ఎన్నో గ్రంథాలు, రచనలు రచించి ప్రపంచ విజ్ఞానాన్ని గ్రంథాలయాల ద్వారా పాఠకుల ముందుంచారు. అప్పటి గ్రంథాలయాలు దినదినాభివృద్ధి చెందుతూ విజ్ఞాన భాండాగారాలు నిలిచాయి. రాయలసీమ జిల్లాలోని కర్నూలు, వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఆవరణాల్లో, కోవెలకుంట్లలో నంద్యాల మాజీ ఎంపీ ప్రోచా బ్రహ్మానందరెడ్డి సహకారంతో గాడిచెర్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా వెలుగోడు గ్రంథాలయ ఆవరణలో ఏడాదిన్నర క్రితం గాడిచెర్ల విగ్రహాన్ని నెలకొల్పారు.

భగవాన్ నామస్మరణకు సమయం కేటాయించాలి


పాలరాతి సరస్వతిదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న వేదగాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు

డోన్: నిత్య జీవితంలో ప్రతిఒక్కరూ భగవాన్ నామస్మరణకు కొంత సమయాన్ని కేటాయించాలని కళారత్న, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్ వద్ద నిర్మించిన గాయత్రి పీఠానికి సుమారు రూ.25 లక్షలు విలువ చేసే పాలరాతి సరస్వతిదేవి, రాజరాజేశ్వరి విగ్రహాలను గండ్లూరి దత్తాత్రేయశర్మ, గండ్లూరి క్రిష్ణ మోహన్, గండ్లూరి రాజేంద్రప్రసాద్ దంపతులు విరాళంగా అందజేశారు. ఈ విగ్రహాలకు దత్తాత్రేయశర్మ, అన్నపూర్ణమ్మ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన దేవతామూర్తులకు షోడశోపచార పూజలు చేపట్టారు. కార్యక్రమానికి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకరశర్మ, ఉపాధ్యక్షులు భాస్కర్ శర్మ, కల్లె శేషావలి శర్మతో పాటు బ్రాహ్మణ సంఘం నాయకులు చంద్రశేఖర్ శర్మ, ప్రణీత్‌శర్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

54 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


దుంగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల మండలం చాబోలు గ్రామ శివారులో అక్రమంగా లారీలో తరలిస్తున్న 54 ఎర్ర చందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్, హైదరాబాద్, ప్రకాశం జిల్లాలకు చెందిన నలుగురు వ్యక్తులు తిరుపతి నుంచి కర్నూలుకు లారీలో ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు వైఎస్సార్ జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. ఈక్రమంలో నంద్యాల చాబోలు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని తనిఖీ చేయగా 1,250 కేజీలు ఉన్న 54 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.62.50 లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ తెలిపారు. దుంగలను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఓ బడా వ్యాపారి ఎర్ర చందనం దుంగలను తరలిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మరికొంత మంది ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల్లో కడప రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవులు, ఎస్‌ఐ నరేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో వ్యాపారుల సిండికేట్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు పంట ఉత్పత్తులు పోటెత్తుతున్నాయి. ఉల్లి, వేరుశనగ భారీగా వస్తుండటంతో మార్కెట్ యార్డు సందడిగా మారింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా అతి పెద్ద జంబోషెడ్ నిర్మించడం రైతులకు ఎంతో సౌకర్యంగా మారింది. భారీ వర్షాలు కురిసినా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండకపోవడం విశేషం. మార్కెట్‌కు శుక్రవారం 235 మంది రైతులు 7,691 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చారు. అయితే వ్యాపారుల సిండికేట్ వ్యవహారం రైతుల పాలిట శాపంగా మారింది. ఉల్లి రైతులను ఆకర్షించేలా వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒకటి లేదా రెండు లాట్‌లకు మాత్రమే కాస్త ఎక్కువ ధరనే కోట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా గరిష్ట ధర రూ.3,801 నమోదైంది. మోడల్ ధర మాత్రం రూ.1422 మాత్రమే పలికింది. అంటే అత్యధిక లాట్లకు రూ.1000 నుంచి రూ.1,500 వరకు మాత్రమే ధర లభించింది.


వ్యవసాయ ఉత్పత్తులతో జంబోషెడ్

- వేరుశనగ కూడా మార్కెట్‌కు భారీగా వస్తోంది. 241 మంది రైతులు 2,350 క్వింటాళ్ల వేరుశనగ తీసుకొచ్చారు. కనిష్టంగా రూ.1,512, గరిష్ట ధర రూ.7,670 లభించింది.
- కొర్ర ధరలో ఎలాంటి పురోగతి లేకపోగా మరింత తగ్గుతోంది. మార్కెట్‌కు 412 క్వింటాళ్ల కొర్రలు రాగా.. కనిష్ట ధర రూ.1,896, గరిష్ట ధర రూ.3098 లభించింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


గుర్రప్ప(ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. మండలంలోని అమడాల గ్రామానికి చెందిన గుర్రప్ప(42) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం కోవెలకుంట్లలో ఇంటి నిర్మాణానికి సంబంధించి పునాది గుంతలు తవ్వి పని పూర్తయ్యాక ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. బనగానపల్లె చౌరస్తాలో ఆటో ఎక్కేందుకు నడుచుకుంటూ వెళుతుండగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కర్నూలు నుంచి ప్రొద్దుటూరు వెళుతూ గుర్రప్పను ఢీకొనడంతో బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారులు గురు ఈశ్వర్, గురునాథ్ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎనిమిది నెలల క్రితం అదే ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన బాలమద్దయ్య అనే వ్యక్తి లారీ కింద పడి మృతి చెందాడు. ప్రమాదకర మలుపు కావడంతో ఈ ప్రాంతంలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి.

కుందూలో గాలింపు ముమ్మరం

- వ్యక్తి మృతదేహం లభ్యం



కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల సమీపంలో గురువారం కుందూనదిలో గల్లంతైన వ్యక్తుల మృతదేహాల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి, బాల గుర్రప్ప అనే వ్యక్తులు గురువారం నదిలో గల్లంతు కావడంతో శుక్రవారం ఎస్‌డీఆర్ఎఫ్ (స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) సిబ్బంది రంగ ప్రవేశం చేశారు. సుమారు 22 మంది సిబ్బంది నదిలో బోటు సాయంతో నదిలో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కలుగొట్ల- జోళదరాశి మధ్యలో సుడిగుండాల సమీపంలో బాలగుర్రప్ప మృతదేహం లభ్యమైంది. రామసుబ్బారెడ్డి మృతదేహం కోసం మండలంలోని జోళదరాశి, కోవెలకుంట్ల, భీమునిపాడు, గుళ్లదూర్తి, అల్లూరు వరకు నది వెంట గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

హత్యా.. ఆత్మహత్యా?

- అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


కురువ కారుమంచప్ప (ఫైల్)

చిప్పగిరి: ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చిప్పగిరిలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొలంలో మరచి వచ్చిన వ్యవసాయ పనిముట్లు తీసుకురమ్మని కుటుంబ సభ్యులు చెప్పగా గురువారం సాయంత్రం కురువ కారుమంచప్ప (62) వెళ్లాడు. రాత్రి ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా, కొలుకు చేసుకుంటున్న పొలం సమీపంలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మెడభాగంలో ఉరి వేసినట్లు ఉండటం, కాళ్లు నేల తాకుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు ఇలా చేశార.. నిజంగా ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. శుక్రవారం ఉదయం పోలీసులు జాగిలాలతో తనిఖీ నిర్వహించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకట రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పరిశీలించారు. అనుమానాస్పన మృతి కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. మృతిడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట రామయ్య

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య

బనగానపల్లె రూరల్: పట్టపగలే దోపిడీకి పాల్పడిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఈనెల 6వ తేదీన బనగానపల్లెలో లాడ్జి నిర్వాహకురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలను అపహరించిన బందెల దానమయ్యను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కేసు వివరాలను సీఐ కృష్ణయ్య విలేకరులకు వివరించారు. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన బందెల దానమయ్య వ్యవసాయ పనులు చేసుకుంటూ దురలవాట్లతో జూలాయిగా మారాడు. దీంతో అప్పులు అధికమయ్యాయి. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన బనగానపల్లెలోని సప్తగిరి లాడ్జీలో అద్దెకు దిగాడు. ఇక్కడ ఒంటిరిగా ఉన్న లాడ్జి నిర్వాహకురాలు పార్వతమ్మపై దాడి చేసి, ఆమె ఒంటిపై ఉన్న సుమారు రూ.2లక్షల విలువైన బంగారు చైన్‌తో పాటు ముక్కురాళ్లు దోచుకుని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీం, క్రైం బ్రాంచ్ సిబ్బంది సహకారంతో దోపిడీకి పాల్పడింది దానమయ్యగా గుర్తించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న దానమయ్య శుక్రవారం బనగానపల్లెకు వస్తుండగా ఎస్‌ఆర్‌బీసీ సమీపంలో వాహనాల తనిఖీలో ఉన్న పోలీసులను చూపి పారిపోతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న బంగారు గొలుసు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చాటిన సిబ్బంది నాగన్న, ప్రదీప్, ప్రసాద్, రామకృష్ణను సీఐ అభినందించి రివార్డును అందజేశారు.

22న టైపిస్టు అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్ ఎన్నికలను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు సీ క్యాంప్‌లోని సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, రాష్ట్ర కోశాధికారి బి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్ ఈ నెల 18లోగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికలకు సభ్యులందరూ హాజరై సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ ఎన్నికలకు ఉప ఎన్నికల అధికారిగా గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.వి జయ్‌కుమార్, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల రోజున రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ గోపాల క్రిష్ణ, బీసీ శంకర్‌నాయక్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.